ఈవారం కథ

# ఏటికి మధ్యం

**— వివినమూర్తి**



క్రిష్ణవరం రోడ్డు మీద బస్సు దిగాడు విశ్వనాథం.

రోడ్డు పక్క చింతచెట్టు కింద ప్రయాణీకులు లేరు. మెల్లగా నడక సాగించాడు. చల్లనిగాలి వీస్తోంది. ఆకాశం మీద మబ్బులు ముసురుతున్నాయి. క్రిష్ణవరంలో దీపాలు పెట్టేసారు. ఎగుడు దిగుడులుగా వున్న రోడ్డు మీద ఏదో బండి ఎదురుగా వస్తోంది. ఆముదం వెయ్యకపోవడం వల్ల ఇరుసు మీద చక్రం వికృతమయిన శబ్దం చేస్తూ తిరుగుతోంది. రోడ్డు దిగి బండికి దోవ యిచ్చాడు విశ్వనాథం.

క్రమంగా క్రిష్ణవరం వెనకబడింది.

అడుగు బరువుగా పడుతోంది.

'ఏమవుతుంది రేపు?' —

అదీ ప్రశ్న. ఆ వాతావరణం కన్న భయంకరంగా వుంది ప్రశ్న. పెద్దాపురం కోర్టులో అది నెత్తి మీదకి పురికింది. ప్లీడరు నోటమ్మటా, జడ్జి మాపమ్మటా బయటకు వచ్చిందా ప్రశ్న. దాన్ని తప్పించుకోటాని! బస్సు ఎక్కాడు. వెంటబడింది. బస్సు దిగాడు వెంట దిగింది. నడిచాడు. వెంట నడిచింది. మూపు మీదకు ఎక్కించుకున్న మేకపిల్ల దెయ్యంగా మారి బరువును పెంచి కుమ్మేస్తున్నట్లుగా వుంది ఆ ప్రశ్న.

ఒకప్పుడు వంద ఎకరాల భూకామందు తండ్రి. గ్రామంలో ఆయనకి బ్రహ్మరథం పట్టేవారు. కుల స్తులూ , బంధువులూ అన్ని విషయాలలోనూ ఆయన సలహా పాటించేవారు. మాట మీద వుండే వారు. ఇద్దరు కట్టటం మొదలెట్టాక ఇంట్లో అందరి చేతా కట్టించాడు. పెద్ద కొడుకుని వ్యవసాయంలో పెట్టి చిన్న వాళ్ళను చదువులో పెట్టాడు. వ్యవ సాయంలో తండ్రికి బాసటగా నిలబడి విశ్వనాథం అందరిచేతా ఔననిపించుకున్నాడు.

తమ్ముళ్ళను పట్నాలలో పెట్టి చెప్పించిన చదువు లకూ, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ, పెట్టుపోతలూ వాటికోసం చేసిన బాకీలకూ అవి తీర్చలేక పెరిగి పోయిన చక్రవడ్డీలూ, కాటా వడ్డీలకూ ఎకరాలు కరిగి పోయాయి. ఇంట్లో బంగారాలు తరిగిపోయాయి.

తండ్రి వెనక నిలబడిన విశ్వనాథం జరుగుతున్నది గ్రహించేలోగా తండ్రి మరణించాడు. పెద్ద కర్మ వైభవంగా జరిగింది. వెంటనే వాటాలు వేసి తమ భూముల్ని అమరకం చేసుకుని వచ్చిన దాన్ని ఒబ్బిడి చేసుకుని ఉద్యోగాలకు వెళ్ళిపోయారు తమ్ముళ్ళు. తల్లి మెడలో బంగారాన్ని మంచి మాటలాడి పంచుకు పోయారు చెల్లెళ్ళు. లోక పద్ధతిని చెప్పబోయిన వాళ్ళను ఎద్దేవా చేశాడు విశ్వనాథం. అనాదిగా వస్తున్న దని అతను భావించే సంప్రదాయాలనూ, ధర్మా లనూ తానూ, తన కుటుంబమూ తప్పదన్నాడు. ఒకరికి చెప్పే మనిషి కడుపున పుట్టి ఒకరి చేత చెప్పించుకోనన్నాడు.

విశ్వనాథం కొన్నేళ్ళ క్రితం ఇంటి మీద అప్పు చేశాడు. అది భూతంలా పెరిగింది. ఋణదాత తన కులం వాడే! కొత్తగా ఇద్దరు కట్టినవాడే! తనను ఏం చేస్తాడులే అన్న ధీమాతో వున్నాడు విశ్వనాథం. కానీ అలా జరగలేదు. వత్తిడి పెరిగింది. కులస్తులూ, మధ్యవర్తులూ ఇల్లు స్వాధీనం చేసి ఋణ విముక్తుడవ మన్నారు. ఇల్లుకి న్యాయమయిన ధర కట్టించి ఉప కారం చేస్తామన్నారు. మిగిలిన డబ్బుతో ఏదయినా నివాసం ఏర్పాటుచేస్తామన్నారు.

గ్రామకరణం విశ్వనాథాన్ని ఏకాంతంగా కలిసాడు.

ఆప్యాయంగా అన్నాడు.

"పెద్దకాపూ! మీ అయ్యా మా అయ్యా ఇద్దరూ కలిసి కాశి వెళ్ళి వచ్చారు. ఇద్దరూ ఆ విశ్వనాథుడి పేరే నీకూ నాకూ పెట్టుకున్నారు. మన కుటుంబాల మధ్య అనుబంధం తరతరాల నించీ వుంది. అందుకని యింతగా చెపుతున్నాను. లోగడ ఏం చెప్పినా విని పించుకున్నవాడివి కాదు. ఈ ఊళ్ళో మర్యాదకు పోయి మర్యాద పోగొట్టుకున్న వాళ్ళం మనం! నువ్వు ఇల్లు ఖాళీ చెయ్యటం నాకు సుతారామూ యిష్టం లేదు -" అన్నాడు.

"ఏం జెయ్యమంటారూ?" అన్నాడు విశ్వనాథం.

చెప్పాడు. మైనరు మారేజ్ యాక్టు వివరించాడు. ఇంటి మీద తనఖా పత్రం తనే వ్రాసాడు. పధ్నాలుగేళ్ళ రాజమ్మకు పెళ్ళి నిమిత్తం అప్పు యిచ్చినట్లుగా అందులో వుంది. కనక ఆ అప్పు చెల్లదు. "వాడు కోర్టుకు పోతే మనం వాదిద్దాం!" అన్నాడు.

"అప్పు ఎగ్గొట్టడం ధర్మం కాదు —" అన్నాడు విశ్వనాథం.

"మనిషిని - ఒకప్పుడు అనేక సాయాలు చేసిన మనిషిని — ఇంట్లోంచి వెళ్ళగొట్టడం ధర్మమా!" గొంతు పెంచి అన్నాడు కరణం.

విశ్వనాథం తటపటాయించాడు.

"నువ్వు మాత్రం అప్పు తీర్చనన్నావా? నయానా భయానా నిన్ను బుట్టలో వేస్తున్నారు మీ వాళ్ళు. నీ పక్షాన వాళ్ళు అవతలి మనిషితో గట్టిగా మాట్లాడారా? తీరుస్తాడులే — కొడుకులు అందొచ్చేక తీరుస్తాడని సబబు చెప్పాలి. నువ్వెంత నిక్కచ్చి మనిషివో మరొకళ్ళు చెప్పనక్కరలేదు. వాళ్ళది గుర్తుంచుకున్నారా? —"

విశ్వనాథం మాట్లాడలేదు.

రాజమ్మ మైనరు అని చెప్పటానికి బర్త్ రిజిస్టర్ ఎక్స్‌ట్రాక్ట్ దాఖలు చేశాడు విశ్వనాథం లాయరు. మేజరు అని చెప్పటానికి ఎలక్షన్ లిస్టు చూపించాడు ఋణ దాత లాయరు. ఆ ఋణ దాత ఎన్నికలలో నెగ్గటానికి పిల్లలచేత పమిటలు వేయించి పన్నెండేళ్ళ వాళ్ళని కూడా ఇరవై ఒకటి ఏళ్ళ వాళ్ళని చేసి లిస్టులో చేర్పించాడు. అందులో రాజమ్మా వుంది. అబద్ధా లాడటం చేతగాని విశ్వనాథం సత్యం కూడా చెప్పే ధైర్యం లేని బెదురుగొడ్డులా బోనులో నిలబడ్డాడు. వాది ప్రత్యేక విజ్ఞప్తి మీద రామాయణాన్ని ముట్టుకొని ప్రమాణం చేశాడు ప్రతివాది విశ్వనాథం. రాముడు తన విల్లు ఎక్కుపెట్టి ఎదురుగా నిలబడినట్టుంది అతనికి!

లాయరు ప్రశ్నలు దూసుకువస్తున్నాయి. తన లాయరు యిచ్చిన తర్ఫీదు పనిచెయ్యటం లేదు. ఆ ప్రశ్నలు అర్థమవటం లేదు. జవాబులు యివ్వక తప్పటం లేదు.

"నీకెంత మంది పిల్లలూ?"

"ఏడుగురు —"

"పుట్టినవాళ్ళెందరు?"

విశ్వనాథానికి అంధకారంలో తడుముకుంటున్నట్టుంది. రకరకాల అంకెలు నోటికి వస్తున్నాయి. ఎందరు పుట్టారు? ఏ సంవత్సరాలలో పుట్టారు? ఎందరు చనిపోయారు? ఏ సంవత్సరాలలో పోయారు? పోయినప్పుడు వాళ్ళ వయసెంత? బర్త్ రిజిస్టర్‌లో అందరూ నమోదయారా? డెత్ రిజిస్టర్‌లో నమోదయారా?

కోర్టంతా నవ్వులు.

విశ్వనాథం తలవంచుకుని దిగాడు. జడ్జి పరమ క్రూరంగా చూశాడు. 'పుట్టిన పిల్లలెందరో తెలీని నువ్వూ తండ్రివేనా?' — అన్నట్లు చూశాడు. ఆ చూపు వెన్నులో గుచ్చుకున్నట్లుంది. సత్యమూ అసత్యమూ గూడా కోర్టులో చెప్పలేకపోయినందుకు విశ్వనాథానికి బాధలేదు. సంతోషం లేదు. రాముడు ఎక్కుపెట్టిన వింటి నించి బాణం విడిచాడో లేదో తెలీదు. లాయరు మాత్రం బాణాలు విడిచాడు — "నిన్నింక ఎవడూ రక్షించలేడు కాపూ! అబద్ధమాడటం వచ్చినవాడే వకాల్తా నామా మీద సంతకం పెట్టాలి! నిజమయినా చెప్పటం రానివాడివి కోర్టుకెందుకు వచ్చావు? అడవులు పట్టి పోక! మా ప్రాక్టీసులు తగలెయ్యటానికే నీలాంటి వాళ్ళు వస్తారు" అన్న ధోరణిలో మాట్లాడాడు.

'నిండా మునిగిన వాడికి చలేమిటి?' అని సామెత. ఈ సామెతలో వాస్తవమున్నా, మంచి సందర్భంలో దీన్ని వాడుతున్నట్టనిపించదు. 'ఒక వ్యక్తి అనాలోచననీ అజాగ్రత్తనీ సూచించడానికో, లేకపోతే దుస్సాహసానికి దిగమండటాన్ని తెలిపేందుకో యీ సామెతని ఉపయోగిస్తుంటారు. కష్టాలు మనిషిలోని జీవన చైతన్యాన్ని చంపలేవు - అన్న అర్థంలో ఉపయోగిస్తే యీ సామెత గొప్ప జీవన సత్యం అవుతుంది.

ఏటి మధ్యంలో బెదిరిన మనిషికైతే చావనున్నట్టే అనిపించవచ్చు. నిష్క్రియగా చావడం కన్నా సాహసించి కాళ్ళూ చేతులూ కదల్చి యీదితే అవతలి గట్టెక్కే అవకాశం వుండడమూ అంతే వాస్తవం. ఏమైనా ఏటి మధ్యంలో వున్న మనిషికి పిరికితనం కన్నా ధైర్యమే మేలు చేస్తుందనడానికి సంశయం అక్కర్లేదు.

ఏలేటికీ కృష్ణవరానికీ మధ్యనున్న మామిడితోటలో అడుగుపెట్టిన విశ్వనాథం తలెత్తి చూశాడు. చేతి మీద అంటిన తడిని తుడిచాడు.

అల్లుకుపోయి వున్న మామిడిచెట్ల కొమ్మల సందుల్లోంచి ఆకాశం ముక్కలు ముక్కలుగా కనిపిస్తోంది. మెరుపు కాంతులు ఆ ముక్కల్ని చూపించటానికి ఎవరో వేస్తున్న టార్చిలైటు వెలిగి ఆరిపోతున్నట్లు వున్నాయి. రాబోయే ప్రమాదాన్ని గ్రహించిన గాలి హృదయం భయంతో బిగుసుకుపోయి గడ్డ కట్టుకుపోయినట్టుంది.

అంగుళం ప్రమాణంలో వున్న వడగళ్ళు ఒక్కసారుగా దూసుకురావటం మొదలయింది.

గబగబా నడిచి ఓ మామిడిచెట్టు కిందకి చేరాడు విశ్వనాథం.

వడగళ్ళ నించి కొంత తప్పించుకున్నా భయావహంగా భోరున కురుస్తోంది వాన. రెప్పపాటులో అతని ఇద్దరు బట్టలు ముద్దముద్దయిపోయాయి. ఒక్కమారుగా వాటి బరువు పెరిగిపోయింది. వయసూ, జీవితమూ, ఆనాటి కోర్టులోని సంఘటనా ఆ వ్యక్తి మనసుని కృంగదీస్తూంటే ఆ బట్టల బరువు మరింత తోడై ఆ శరీరాన్ని దిగలాగేస్తోంది. చల్లని వానధారులు సూదుల్లా పొడుస్తున్నాయి.

ఆ మామిడితోటలో ఓ పుట్ట వుంది. అది పన్నెండడుగుల ఎత్తు. దానికి చుట్టూ ఓ ప్రహరీ పైన ఓ కప్పు ఏర్పాటుచేశారు భక్తులు. దానిలో నివాసమున్న సుబ్రహ్మణ్యస్వామి ఆ తోటంతా తిరుగుతూ వుంటాడట. ఆ ఏలేటిని పొంగకుండా అటూ యిటూ వున్న గ్రామాల మీద పడకుండా అడ్డుకుంటాడట. షష్ఠికి ఆ ప్రదేశంలో చాలా పెద్ద తీర్థం జరుగుతుంది. భోగం మేళాల్లూ బాణా సంచాలూ, రంగుల రాట్నాలూ, అన్ని రకాల కొట్లూ అక్కడ చేరతాయి. చెవిపించి రసికారే పిల్లల చేత అక్కడ పాలు పోయిస్తారు. పిల్లలు పుట్టాలని మొక్కుకుంటారు. ఆ తీర్థం అయిపోయాక అక్కడ ఎవరూ వుండరు. వచ్చే పోయే బాటసారులు ఆగి పుట్ట చుట్టూ ప్రదక్షిణం చేసి ఓ పండో పువ్వో అక్కడ వుంచుతారు. తీర్థం కోసం ఏర్పాటుచేసిన పాకల్లో దగ్గర వూళ్ళ వాళ్ళు కొన్ని వదిలేస్తుంటారు.

అలాంటి పాక ఒకటి వుండాలన్న విషయం విశ్వనాథానికి స్ఫురించింది. వేగంగా అటు నడిచాడు.

అంచనా నిజమే! తరుముతున్నట్లుగా ఆ పాకలోకి జొరబడ్డాడు. అయితే పాక ఖాళీగా లేదు.

పాకలో ఓ చిన్ని బుడ్డి దీపం వెలుగుతోంది. లోపల ఓ ముసిలి మనిషి ఓ ఆడమనిషీ నలుగురు పిల్లలూ వున్నారు. ముసలతను గోనె పట్టాను నెత్తిమించి వీపుమీదకి కప్పుకొని, అడ్డచుట్టను నోట్లో బిగించి, ముదుచుకుని కూర్చునున్నాడు. ఆడమనిషి కూడా అడ్డ చుట్టతో కూర్చునుంది. చలినించీ

## చెప్పింది చేసిన బాపూజి

గాంధీజి భార్య కస్తూరిబా కోమారు జబ్బు చేసింది. త్వరలో కోలుకో లేదు. గాంధీజి చేస్తున్న జల చికిత్సవల్ల ఏ మాత్రం గుణం కనిపించలేదు.

— గాంధీజి, ఉప్పు,పప్పు తినడం మానుకోమని కస్తూరిబాకు చెప్పారు. అందుకు ఆమె సమ్మతించలేదు. గాంధీజి ఎంతగానో నొక్కి చెప్పారు. చివరకు విసుగెత్తి "ఎవరైనా మిమ్మ ఉప్పు, పప్పు తినడం మానుకోమని సూచిస్తే, మీరు కూడా మానుకోలేరు" అన్నారు కస్తూరిబా.

గాంధీజి ఆశ్చర్య చకితులయ్యారు. "నాకు జబ్బు చేస్తే, వైద్యులు ఫలానా ఆహార పదార్థాన్ని వదలుకోమంటే వెంటనే వారి సూచన పాటిస్తాను. అదలా వుండనీ-వైద్యులెందుకు? నేటి నుంచి ఒక ఏడాదిపాటు, ఉప్పు, పప్పు వదలి వేస్తాను. నీవు తిన్నా, తినకపోయినా సరే. ఆ విషయం నీ ఆరోగ్యానికి సంబంధించినది. ఆలోచించుకో" అన్నారు గాంధీజి.

కస్తూరిబా దిగ్భ్రాంతి చెందారు. ఎంతో బాధ పడ్డారు. కన్నీరు కారుస్తూ "నన్ను మన్నించండి. మీ స్వభావం తెలిసికూడా నేను అనరాని మాటలన్నాను. ఉప్పు, పప్పు వదలి వేస్తాను. మీ మాటలను ఉపసంహరించుకోండి. అదే నాకు పది వేలు" అన్నారు కస్తూరిబా.

"నీవు ఉప్పు, పప్పు వదలుకోవడం మంచిదే. అందువల్ల నీ ఆరోగ్యం కుదుట పడుతుంది. కాని నేను చేసిన ప్రతినకు తిరుగులేదు. ప్రతి మనిషికి సంయమనం మంచిది. ఇది నాకు పరీక్ష. నీ దీక్షకు నా సంకల్పంతోడ్పడగలదు" అన్నారు గాంధీజి.

—జానమద్ది హనుమచ్ఛాస్త్రి

పైనించి కారుతున్న వానధారల నించీ రక్షించటానికి పిల్లల మీద ఒక చీరని కప్పింది. వాళ్ళ పక్కన రెండు కావిళ్ళలో కొద్దిపాటి సామాను వుంది. ఓ గోనె సంచి నించి అల్యూమినియం పాత్రలు బయటికి కనిపిస్తున్నాయి.

ఉన్న వెలుతురులో వాళ్ళను గమనించగలిగినంతా గమనించాడు విశ్వనాథం.

అకస్మాత్తుగా వచ్చిన వ్యక్తిని చూసి ఆడమనిషి సర్దుకుని కూర్చుంది. నోట్లోంచి అడ్డమట్ట తీసి, చేరిన ఉమ్మిని పక్కనే ఉమ్మి దానిమీద యిసకని పోస్తూ ముసలతను అడిగాడు —

"ఎవరారూ?"

"తిమ్మాపురం —" చొక్కా కొసలు పిండుకుంటూ విశ్వనాథం అన్నాడు.

భారీగా వున్న విశ్వనాథం విగ్రహాన్నీ, బుగ్గ మీసాలనీ, ఆ బట్టలనీ అంతకన్న ఆ స్వరాన్నీ నోరు తెరిచి చూస్తూ వింటూ ఏదో గుర్తు చేసుకుంటున్నట్లు ముసలతను అన్నాడు.

"నువ్వు యిస్సినాదం బాబువిగదూ!"

ఆ ముఖాన్ని గుర్తుపట్టటానికి ఆ వెలుతురు చాలటం లేదు. కూర్చుని వుండటం వల్ల ఒడ్డూ పొడవూ ఆకారమూ తెలియడం లేదు. విశ్వనాథం పట్టి పట్టి చూస్తూ అన్నాడు.

"ఆ! నువ్వెవరివి?"

"బాబో బాబో" అంటూ చటుక్కున లేవబోయాడు ముసలతను. కూర్చుని కూర్చుని కుదుళ్ళు పట్టిన మోకాళ్ళు స్వాధీనం అవలేదు.

"లేవక! లేవక" అంటూనే వున్నాడు విశ్వనాథం.

"నా యిస్సినాదం బాబే! నా తండ్రే!" అంటూ లేచి ముందుకువచ్చి విశ్వనాథం మీద చేతులు వేసి ఒళ్ళంతా తడిమాడు.

"నేను బాబూ! తలుపుల్ని! యిదేటి బాబూ!

నాకన్నా ముసిలోడివై పోయావూ..."

"తలుపులా!!" గుర్తుచేసుకోటానికి విశ్వనాథం ప్రయత్నించాడు.

"అవును బాబా! ఉప్పరోళ్ళం! గుమ్మన్న కొడుకుని! నీ కమతంలో పదిహేనేళ్ళు కాపదనం చేసానూ! ఆడినే! నిన్నెత్తుకుని మోసేవాడిని! దుబ్బులాగుండే వోడివి! ఏం తిండి తినీవోడివి!..."

అవును! తలుపులు కుటుంబం తన తాత దగ్గర నించి తమ కమతంలో వున్నారు! ఈ తలుపులుతో సహా అనేక కుటుంబాలు సీలేరు ప్రాజెక్టులో పనులు దొరుకుతాయని వెళ్ళిపోయారు. పాతికేళ్ళ క్రితం సంగతి అది! అప్పటికే తలుపులుకి భార్యా నలుగురు కొడుకులూనూ!

అక్కడికి వెళ్ళిన కొన్ని నెలలకే మన్నెపు జ్వరం వచ్చి భార్య పోయింది. చేతికి అందొచ్చిన కొడుకులు యిద్దరూ ఒకరి తర్వాత ఒకరుగా ప్రమాదాలలో మరణించారు. శవాలు కూడా దొరకలేదు. కంట్రాక్టరు నష్టపరిహారంగా వంద చొప్పున యిచ్చాడు. మూడో కొడుక్కి పెళ్ళయింది. అతనికి కాలు విరిగింది. భార్య ఎవరితోనో పోయింది. అతను అడుక్కుంటున్నాడు. ఆఖరిదానికి పెళ్ళయింది. పిల్లలు నలుగురూ అతని సంతానమే! పెళ్ళాం కానుపులుతో జబ్బు పడింది. మంచాన పడింది. సుఖపెట్టినన్నాళ్ళూ కూడావున్నవాడు, సంసారాన్ని వదిలేసి ఎక్కడికో పోయాడు. తిరిగి రాలేదు. చచ్చిపోయిందనుకున్న మనిషే బతికింది. క్రమంగా లేచి అటూ యిటూ తిరిగింది. మంచాన వున్నన్నాళ్ళూ మంచినీళ్ళన్నా అంగుట్లో పోసి, నత్తనావలాంటి పిల్లల్ని సాకాడు తలుపులు. ముసిలివాడయిపోయిన అతన్ని అంటిపెట్టుకుని వుండిపోయింది. కన్న తండ్రికి పోసినట్టే గంజి పోస్తోంది. ప్రాజెక్టులో పనులు ఎప్పుడో ఆగిపోయాయి. కోడలూ మామగారూ మాట్లాడుకున్నారు —

పాతికేళ్ళ జీవితాన్ని పది ముక్కల్లో నిర్వికారంగా తేల్చి చెప్పేసిన తలుపులు అన్నాడు —

"— నీ యింట్లో కలబడి తింటానని సెప్పాను బాబూ! వద్దురా తలుపులూ — యెల్లమాక అని నువ్వు సొప్పితే యినలేదు — అనుబగించాను! — ఆ బాబు మనకి సోటెడతాడు! ఆరి సెరుకు తోటలంటా మామిడి తోటలంటా సింత సెట్లెంటా కాపలా కూకుంటే నాకు గడిసిపోతాది! ఆరి మనవలు పారేసిన మెతుకుల్లు ఏరుకుంటే — ఆరి గొడ్లమ్మట తట్టట్టుకుని తిరిగితే — నీ బిడ్డలకి గడిసిపోతాది! పదవే మంగా! అని రెక్కట్టుకుని లారీ ఎక్కించేను! కిట్టారం రోడ్డు కాడ బస్సు దిగినాం! అదేటి బాబూ! లోకం యిలా తిరగబడిపోయిందీ! ఒక్కరంటే ఒక్కరు తిమ్మాపురం మదుసులు ఆపడలేదూ! అలాగే పడతా లేస్తా వచ్చాం! ఏరు పూటుగా వుంది! ఆ రోజుల్లో అడ్డడి యీదుకు పొయ్యే వోడినే! సీకట్లో ఎటి దిగుదారని పస్తాయించినాం! — యిందల కూకుని నీ ఊసులే సెప్పుకుంటున్నాం —"

తలుపులు మాట్లాడుతూనే వున్నాడు.

విశ్వనాథం లేచి నించున్నాడు.

'బాబూ! బాబో! ఎక్కడికెళ్లిపోతన్నావ్?' అంటూ తలుపులు వెనకాల కేకలేస్తున్నాడు.

ఆ గొంతు విశ్వనాథం నడుంకి పగ్గంలా చుట్టుకుంది.

ఆ గొంతు — విశ్వనాథం జీవిత సాఫల్య వైఫల్యాల మీదా కప్పబడిన ఊహల మాయను — పక్కకి లాగేస్తోంది!

ఆ గొంతు ద్వారా వినిపించిన తలుపుల జీవితంతో నీ జీవితాన్ని బేరీజు వేసుకో అంటోంది.

అవును! తలుపులు ఎన్నింటిని కోల్పోయాడు? భార్యనూ- సంతానాన్నీ! ఏం పొందగలిగాడు? కడుపు నిండా తిండినీ, కట్టుకోటానికి నిండయిన బట్టనీ, వుండటానికొక ఇంటినీ ... దేన్నీ పొందలేదు. అతనికి చెప్పకోటానికి వంశచరిత్ర లేదు. మీసం దువ్వటానికి పరువు లేదు! అయినా తలుపులు చావలేదు. బతికాడు. బతకటం కోసం తిమ్మా పురం నించి సీలేరు, సీలేరు నించి మరో వూరూ, మళ్ళీ తిమ్మాపురం ...

మరి తనూ? ఏం తప్పచేశాడని చావాలి?

ఈ రోజున ఇద్దరు కడుతున్న వాళ్ళు తాగుతున్నారు. ఆడవాళ్ళను బలిమిని అనుభవిస్తున్నారు. ఎన్ని వేషాలయినా కడుతున్నారు. ప్రజలకి సారాలు పోసి డబ్బులు పోసి మర్డర్లు చేసి ఓట్లు సంపాదించి ఎన్నికలు నెగ్గి పదవులు సంపాదించుతున్నారు. పదవులను డబ్బు సంపాదనకి మార్గం చేస్తున్నారు. అధికారులకి డబ్బులు తినబెట్టి కాంట్రాక్టులు సంపాదించి ఇసకతోనే బ్రిడ్జీలూ, బిల్డింగులూ కట్టి ఏడాది తిరగకుండా లక్షలు లక్షలు పోగుచేసుకుంటున్నారు!

అన్ని తప్పలు చేసినవాళ్ళు వాళ్ల - తనని చూసి తలొంచుకోవాలి! తలుపుల్ని చూసి తలదించుకోవాలి! తాను తలుపుల్ని చూసి జీవించాలి!

ఏది ఏమయినా తాను చావడు!

విశ్వనాథానికి ఒడ్డు దగ్గరగా కనిపిస్తోంది.

తలుపులు అరుపులికి సమాధానమిచ్చాడు.

"రేపు కలుద్దాం తలుపులూ!"